# ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం




మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, నవంబర్ 16 : ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో సాధారణ పరిశీలకుడు బాలకిషన్ ముండా, కౌశిగాన్, వ్యయ పరిశీలకుడు విజయ్ నట్కే, ప్రమోద్‌కుమార్, అదనపు కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 210 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు చెప్పారు. 173 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. పోలింగ్ రోజు ఉదయం 5.30కి మాక్ పోలింగ్ నిర్వహణ ఉంటుందన్నారు. మాక్ పోలింగ్‌లో 50 ఓట్లు వేశారా లేదా అని పరిశీలన చేయాలని సూచించారు. పీఓ డైరీలో అన్ని సంఘటనలు ఎప్పటికప్పుడూ సమోదు చేస్తున్నారా లేదా పరిశీలన చేయాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు హాజరైనది లేనిది తప్పక చూడాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు ఎప్పటికప్పుడూ సాధారణ పరిశీలకులకు రిపోర్ట్ అందించాలన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏజీఎం జ్యోతి, ఎల్‌డీఎం బాపూజీ, డీఎల్‌పీఓ సాంబిరెడ్డి, ఏఓ సుందర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఈ 22, 23న రెండో విడుత శిక్షణ తరగతులు..**

ఎన్నికల నిర్వహణలో భాగంగా పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు నిర్వహించే రెండో విడుత శిక్షణ తరగతులకు సకాలంలో హాజరు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, ఆర్పీఓలు, ఎంఈఓలు, ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ తరగతులకు హాజరు కాని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ నెల 22,23 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. బాలింతలు, చిన్న పిల్లల తల్లులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి మాత్రమే శిక్షణ నుంచి మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రియాంక, సీపీఓ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కారు చీకట్లే

- బీఆర్‌ఎస్ పాలనలో గణనీయమైన అభివృద్ధి
- సీఎం కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష
- అభివృద్ధి చూసి మరోమారు ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



అన్నపురెడ్డిగూడెంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

వేములపల్లి, నవంబర్ 16: కాంగ్రెస్ పార్టీ నాయకుల మోసపు మాటలు నమ్మి ఓటేస్తే రాష్ట్రంలో కారు చీకట్లు తప్పవని బీఆర్‌ఎస్ మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని అన్నపరెడ్డిగూడెం, వేములపల్లి, తిమ్మారెడ్డిగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం కలికారు. మహిళలు బొట్టుపెట్టి ఆశీర్వదించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా ప్రచారంలో ఎమ్మెల్యే వెంట నడిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ పదేండ్లలో మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోమారు ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పారీ ప్రజలను గాలికి వదిలేసిందే తప్ప వారి కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ కుర్చీల కొట్లాటే తప్ప ప్రజల గురించి పట్టించుకున్న నాథుడు లేడన్నారు. 11సార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ఆ పార్టీ నాయకులను డిమాండ్ చేశారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజలను అన్ని విధాలుగా ఆదుకున్నారన్నారు. రైతులకు రైతుబంధు, రైతు బీమా, ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా వారి వివాహానికి ఆర్థిక సాయం అందించారన్నారు. వ్యవసాయానికి, పరిశ్రమలకు 24 గంటల విద్యుత్ అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అన్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని వివరించారు.

**రూ.258 కోట్లతో అభివృద్ధి**

వేములపల్లి మండలంలో 2014 నుంచి 2023 వరకు రూ.258.21కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే చెప్పారు. దాంతో పాటు సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.286.70కోట్లు వెచ్చించింది తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగేందుకు మరో మారు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. తనను మరో మారు ఆశీర్వదిస్తే మిగిలిన అభివృద్ధిని అనతికాలంలోనే పూర్తి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన అన్ని పథకాలను సీఎం కేసీఆర్ మూడోసారి అధికారంలోకి రాగానే అమలు చేస్తారన్నారు. అసైన్డ్ భూములపై ఉన్న ఆంక్షలను రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఎత్తివేయనుందని చెప్పారు. అగ్రవర్ణాల పేదల పిల్లల కోసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున గురుకులాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డు దారులకు పూర్తి స్థాయిలో సన్నబియ్యాన్ని అందిస్తామన్నారు. గతంలో ఇచ్చిన ప్రతి హామీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని, ప్రస్తుతం మ్యానిఫెస్టోలో ఉన్న వాటిని సైతం వందశాతం అమలు చేస్తుందన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి తనను మరో మారు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, సర్పంచులు చిర్ర మల్లయ్యయాదవ్, మజ్జిగపు పద్మ, అనిరెడ్డి నాగలక్ష్మి, దేశిరెడ్డి లక్ష్మి, దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, బత్తుల ధనమ్మ, నాయకులు కృపాకర్‌రావు, ఇరుగు వెంకటయ్య, నాగవెల్లి శంకర్, జావెద్, పుట్టల పౌల్, మజ్జిగపు శ్యామ్, సతీశ్‌రెడ్డి, మునీశ్వర్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

- పార్టీ మండలాధ్యక్షుడు బాబయ్య

మాడ్గులపల్లి, నవంబర్ 16: పదేండ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షమ పథకాలు అందించి ఆదుకున్నారని, అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించలని పార్టీ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేలు నోముల భగత్, నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే ఇంట్లో ఐటీ రైడ్స్ జరిగాయంటూ ప్రతిపక్ష నాయకులు అబద్ధపు ప్రచారం చేయడం సరి కాదన్నారు. ఆయన వెంట జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, పోకల రాజు ఉన్నారు.

## మిర్యాలగూడ అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు సతీమణి జయ

మిర్యాలగూడ, నవంబర్ 16 : సీఎం కేసీఆర్ పాలనలోనే మిర్యాలగూడ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, మరింత అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే భాస్కర్‌రావు సతీమణి జయ కోరారు. గురువారం పట్టణంలోని గాయత్రినగర్‌లో కౌన్సిలర్ కుర్ర చైతన్యతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. మూడో సారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు రూ.400కే గ్యాస్ సిలిండర్, పేద కుటుంబాల మహిళలకు రూ.3వేల జీవనభృతి అందించనున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు విజయ్ నెట్కా, బాలకిషన్ ముండా

## అభ్యర్థుల ఖర్చులు పక్కాగా నమోదు చేయాలి

- ఎన్నికల పరిశీలకులు విజయ్ నట్కా, బాలకిషన్ ముండా

సూర్యాపేట, నవంబర్ 16 : ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూర్యాపేట నియోజక వర్గ ఎన్నికల పరిశీలకులు విజయ్ నెట్కా, బాలకిషన్ ముండా అధికారులను ఆదేశించారు. గురువారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సూర్యాపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరబ్రహ్మాచారి అధ్యక్షతన అభ్యర్థుల వ్యయాల నిర్వహణపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల సంఘం రూపొందించిన కార్యచరణ ప్రకారం అన్ని విభాగాలు విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన టీమ్‌లు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పని చేయాలన్నారు. అభ్యర్థుల వ్యయాలు నిశితగా పరిశీలించాలని సూచించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రచార రథాలు, మ్యాన్ పవర్ లాంటివి వీడియోల ద్వారా చిత్రీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, ఏఆర్‌ఓ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆంజనేయులు, లింగయ్య, ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థులు, వారి ఏజెంట్లు పాల్గొన్నారు.

## మఠంపల్లిలో 18న ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రచారం

మఠంపల్లి : బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మఠంపల్లి మండలంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్, జడ్పీటీసీ జగన్‌నాయక్, పార్టీ మండలాధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బక్కమంతులగూడెం, చౌటపల్లి, కొత్తతండా, కాల్వపల్లి, పాత దోనబండ తండా, బాడవ తండా, బిల్యానాయక్ తండా, కామంచికుంట తండా, చెన్నాయిపాలెం, కింది తండా, వర్దాపురం, మంచ్యాతండా, తుమ్మల తండా, లాలి తండా, అవరేణికుంట తండా, సుల్తాన్‌పూర్ తండా, మట్టపల్లి, రామచంద్రాపురం, బోజ్యతండా, బీమ్లాతండా, గుర్రంబోడు, క్రిష్ణతండా, పెదవీడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రచారంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామశాఖ అధ్యక్షులు, బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ

చిలుకూరు, నవంబర్ 16 : మండలంలోని కొండాపురం గ్రామంలో రూ.50లక్షలతో నూతనంగా నిర్మించిన నాగదేవత ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. 17న నాగులచవితి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం, మహా పడిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేనేపల్లి సుగుణమ్మ, ఆలయ కమిటీ సభ్యులు, సొసైటీ చైర్మన్ భాషం సైదులు, ఉపేందర్ పాల్గొన్నారు.

## అభ్యర్థులు ఖర్చులపై అప్రమత్తంగా ఉండాలి

- ఆర్‌ఓ జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్, నవంబర్ 16 : ఎన్నికలో పోటీచేసే అభ్యర్థులు ఖర్చులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌ఓ జగదీశ్‌రెడ్డి సూచించారు. ఆర్‌ఓ కార్యాలయంలో మోర్టల్ కోడ్ ఆఫ్ కండక్ట్, వ్యయ పర్యవేక్షణ గురించి అభ్యర్థులకు గురువారం వివరించారు. అభ్యర్థులు విద్వేష పూరిత ప్రసంగాలు చేయరాదన్నారు. కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు ఏ.కౌసిగన్, వ్యయ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్, తాసీల్దార్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే భాస్కర్‌రావుకు అధిక మెజార్టీ అందించాలి

- బీఆర్‌ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ



వృద్ధురాలిని పలుకరిస్తున్న నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడ : బీఆర్‌ఎస్ మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ గురువారం పట్టణంలోని సంతోష్‌నగర్‌లో విస్తృత ప్రచారం చేపట్టారు. ఏఎంసీ మాజీ చైర్మన్ యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి పగిడిమర్రి నాగేంద్రచారిలతో కలిసి ఇంటించి ప్రచారం చేపట్టారు. పదేండ్లపాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా భాస్కర్‌రావును గెలిపించాలని కోరారు.